
**కథ**

# అడవులు పట్టిన మొగుడ్స్

యాళ్ళ అచ్యుతరామయ్య

**వివాహమనే తుఫానులో చిక్కుకుని, భార్యనే భల్లూకానికి బలైపోతున్న - ప్రతి భర్తకి 'పరమ ఓరిమి చక్ర' అవార్డులు ప్రభుత్వం ఎందుకు ప్రకటించదో వెంగళరావుకు అర్థం కాదు! శకునాలు చెప్పే బల్లి కుడితిలో పడ్డట్టు తక్కిన అన్ని విషయాలలోనూ తెలివిగా ప్రవర్తించే మగాడు పెళ్లి దగ్గరకు వచ్చేసరికి బొక్క బోర్లాపడతాడు. కాబట్టి వెంగళరావు విషయంలో కూడా ఎటువంటి మినహాయింపు లేదు.**



పెళ్లి రోజంటే అందరూ వున్నారు కాబట్టి, ఎలాగోలా ధైర్యం తెచ్చుకుని, చేతులు వణుకుతున్నా వెంగళరావు తాళి కట్టేసాడు. ఆ తర్వాతి కార్యక్రమాన్ని తలుచుకుంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. ఈ శోభనాన్ని ఎవరు కనిపెట్టేడురా దేవుడా! పులినీ, మేకను ఒకే బోనులోకి నెట్టినట్టు భార్యభర్తలిద్దరినీ ఒంటరిగా ఒకే గదిలో బంధించడమేమిటి? ఈ దురాచారాన్ని అరికట్టడానికి ఏ సంఘ సంస్కర్తన్నా నడుం బిగించవచ్చు కదా!!

ఇంతలో మిత్రులంతా వచ్చి ముహూర్తం దగ్గర పడుతోందని చెప్పి, వెంగళరావును శోభనపు గదిలోకి లాక్కెళ్లారు. అమ్మవారికి బలి ఇవ్వడానికి సిద్ధం చేసిన గొర్రెపిల్లలా బేలగా చూసేడు. 'అందుకే మగాడికి మగాడే శత్రువు అన్నారు' అని మనసులోనే అనుకున్నాడు. స్నేహితులు అతన్ని గదిలోకి నెట్టేసి, బయట తలుపుకు గొళ్లెం పెట్టేసారు.

కొంతలో కొంత నయం. పెళ్లి కూతురింకా గదిలోకి అడుగు పెట్టలేదు. ఈలోగా మానసికంగా సిద్ధమవడానికి అతనికి కాస్త సమయం చిక్కింది.

గత కొద్ది రోజులుగా జరిగిన సంఘటనలు రింగులు రింగులుగాఅతని కళ్లముందు గింగరాలు కొడుతున్నాయి. పెళ్లిరోజు దగ్గర పడడంతో వెంగళరావు మొహంలో ప్రేతకళ రోజు రోజుకీ ఎక్కువవుతోంది. ప్రాణస్నేహితుని సలహాపై అతను ఓ ప్రముఖ హిప్నటిస్టును సంప్రదించేడు. అతను వెంగళరావు ముందు కొన్ని విచిత్ర విన్యాసాలు చేసి "నువ్వు మగా

డివి. నువ్వు గండర గండడువి. ఎంతటి మొండి పెళ్లాం వచ్చినా, నువ్వామెను దండించి లొంగదీసుకుంటావు. తొక్కలో పెళ్లాం.... ఓ లెక్కా....'' అని సజెషన్సు ఇస్తూ వున్నాడు. ఇంతలో లోపలి గదిలోంచి అతని భార్య పచ్చడి బండను చేతిలో పట్టుకొని హటాత్తుగా అక్కడ ప్రత్యక్షమైంది.

చెంగు చెంగున దూకే పిల్లికి, ఒక్కసారిగా కుక్క ఎదురైతే ఎలా వుంటుందో? ఆ హిప్నటిస్టు పరిస్థితీ అలానే వుంది. అతని ఒళ్లంతా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కళ్లలో చావుకళ కొట్టొచ్చినట్లు కనిపించింది.

''ఇంతకు ముందు నేనన్న మాటలన్నీ ఉత్తుత్తినే. నేను మగాడిని. శుద్ధ వేస్టుగాడిని. బొంగులో మొగుడు. లొంగకేం చేస్తాడు. భార్యే పెద్ద పుడింగు....'' అంటూ సెల్ఫ్ హిప్నటైజ్ చేసుకుంటూ, పారిపోయి గోడ దూకి జనంలో కలిసిపోయేడు.

ఆ మధ్యనే ఓ కోయదొర ఎదురుబడి, వెంగళరావుకు భార్య గండం వుందనీ, దాన్ని తప్పించుకునే ఉపాయమూ ఉందని చెప్పేడు. ఓ రెండొందల రూపాయలు గుంజి, రక్షరేకుని ఇచ్చి మొలత్రాడుకు కట్టుకోమని చెప్పి, దీంతో ఇతని జీవితం గొప్ప మలుపు తిరుగుతుందని చెప్పేడు. ఆ రక్షరేకు తన వివాహ జీవితానికి శ్రీరామరక్ష అని భావించేడు. ఆ ధైర్యంతోనే పెళ్లికి ఒప్పుకున్నాడు కూడా! రక్షరేకు గుర్తుకు రాగానే అతనికి లక్ష ఏనుగుల బలం వచ్చింది. మాయల ఫకీరు ప్రాణం సప్తసముద్రాల అవతల వున్న మర్రిచెట్టు తొర్రలో నివసించే చిలుకలో వున్నట్లుగా, వెంగళరావు ప్రాణం అతని పేంటూ, దాంట్లోకి టక్ చేసుకున్న షర్టూ, దాని కింద బనీనూ, దానిలోపల మొలత్రాడూ, దానికి భద్రంగా కట్టి వున్న రక్షరేకులోనూ వుంది.

బయట గడియ తీసిన చప్పుడు కావడంతో, వెంగళరావు తన ఆలోచనలన్నిటినీ బుర్రలోకి నెట్టేసి, ప్రస్తుతం జరగబోయే పురుషమేధం గురించి ఆలోచనలో పడ్డాడు. శోభనం రాత్రి జరిగే సంఘటనలే, భర్త భవిష్యత్తును నిర్ణయిస్తాయని స్నేహితులు చేసిన హెచ్చరికలు అతనికి పిచ్చెక్కిస్తున్నాయి.

అంతలో తలుపులు తెరుచుకున్నాయి. ఆత్రేయపురం పూతరేకులా పెళ పెళ్లాడే తెల్లచీర కట్టుకొని పెళ్లికూతురు ఝాన్సీ గదిలోకి అడుగుపెట్టింది. కుడిచేత్తో పాలగ్లాసూ, ఎడం చేత్తో పొడుగాటి కత్తి పట్టుకుని ప్రవేశించిన ఆమెను చూడగానే వెంగళరావు గుండెల్లో డైనమైట్ పేలినట్లయింది.

'పేరు ఝాన్సీ అయినంత మాత్రాన ఈమేమైనా లక్ష్మీబాయినా కత్తి పట్టుకుని రావడానికి! ఇంకా నయం, గుర్రమెక్కి రాలేదు' అని వెంగళరావు మనసులో అనుకున్నాననుకొని పైకే అనేశాడు.

''వెంగళ్! నువ్వుండగా, వేరే గుర్రమెందుకోయ్?'' అందామె.

కత్తిని చూసినప్పుడల్లా, అతనికి గుండె జల్లుమంటోంది. 'శ్రీ ఆంజనేయం.... ప్రసన్నాంజనేయం...' అంటూ వెంగళరావు మనస్సులోనే స్మరించుకుంటూ, ధైర్యం తెచ్చుకోవడానికి రక్షరేకును తడమాలనుకున్నాడు. పేంట్ జిప్ కొద్దిగా కిందకి లాగి, మొలతాడు కోసం వెతికేడు.

ఝాన్సీ కంఠం కంచుగంటలా మోగింది. 'అంతటితో ఆగక్కడ!పిచ్చి పిచ్చి వేషాలేసేవో, పుచ్చెలెగిరిపోతాయ్! వెంటనే జిప్ పైకి లాక్కో. ఏమాత్రం తేడా జరిగినా, నాపై అత్యాచారయత్నం చేసేవని కేసు పెడతా! నా ఒంటికి నీ చిటికెన వేలు తగిలినా, ఈ కత్తితో నీ గొంతు తుత్తునియాలు చేస్తా, ఖబడ్దార్!' అంటూ వార్నింగిచ్చింది.

'పగవాడికే కాదు. మరే మగాడికి ఇలాంటి కష్టాలు రాకూడదు. భగవంతుడా!'అని వెంగళరావు మనస్సులోనే అనుకున్నాడు. ' ఏరోజైతే పురుషులు పడగ్గదిలో హాయిగా గుండెపై చేయి వేసుకొని, కంటిమీద కునుకు తీయగలుగుతాడో, ఆ రోజే మగ్గాళ్లకి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు' అని ఇంతవరకూ ఎవరూ అనకపోతే, తనే అనాలనుకున్నాడు.

భయంతో వెంగళరావు గొంతు ఎండిపోయి, నాలుక పిడచకట్టుకుపోయింది. ఒళ్లంతా చెమటతో తడిచి ముద్దయిపోయింది. 'పురుషుడిగా పుట్టేకంటే, పురిట్లోనే సంధికొట్టి పోయుంటే, ఎంత బావుండేదో కదా!' అని మనస్సులో బావురుమన్నాడు.

ఝాన్సీ మంచంపై కూర్చుని మొత్తం పాలని గడగడా తాగేసి, పరుపు మధ్యలో కత్తిని నిలువుగా పెట్టి ''వెంగళ్, ఈ కత్తే మనిద్దరికి సరిహద్దు. హద్దు మీరావో, ఈ కత్తి స్థానభ్రంశం చెంది, నీ గుండెల్లోకి దిగుతుంది. కాబట్టి, మెదలకుండా హాయిగా నిద్రపో!''అని శాసించింది.

వెంగళరావు కళ్లు బైర్లు కమ్మేయి. ధైర్యే సాహసీ జ్యోతిలక్ష్మీ అని పెద్దలన్నారు కాబట్టి, ఎలాగోలా మొండి ధైర్యం తెచ్చుకొని ''నేనంటే నీకిష్టం లేదా?'' అన్నాడు.

''నువ్వే కాదు. నీ మగజాతంటేనే నాకొళ్లుమంట. నేను కనిపెట్టిన 'పురుష దుంప నాశిని' అనే మందును త్వరలోనే మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాను. దీంతో మగపురుగులను మొత్తంగా దుంపనాశనం చేసి, స్త్రీ జాతి సమస్తానికి విముక్తి ప్రసాదిస్తాను' అంటూ తొడకొట్టి శపథం చేసింది.

పెళ్లి అనే రోటిలో తలపెట్టి భార్య పెట్టే హింస అదే రోకటిపోటుకు భయపడ్డంలో అర్థం లేదని గ్రహించిన వెంగళరావు 'మొగాడి పొడగిట్టనప్పుడు, పెళ్లి చేసుకోకుండానే వుండాల్సింది' అన్నాడు.

''ఓరి, వెర్రి వెంగళప్పా, నీ అమ్మా నాన్న నీకు తగిన పేరే పెట్టేరు. నా పురుష దుంప నాశిని ప్రయోగ దశలో వుంది. ఆ మందు వలన కలిగే అంతిమ ఫలితాన్ని అధ్యయనం చేయడానికి నీలాంటి వెర్రికుట్టి నాకు నిత్యం అందుబాటులో వుండాలి. అందుకే నీతో పెళ్లికి ఒప్పుకొన్నాను'' అంటూ అసలు కుట్రను బహిర్గతం చేసింది.

'మగాడిని ఓ గినిపిగ్‌లా ప్రయోగాలకు వాడుకునే స్త్రీల జులుం నశించాలి. ప్రపంచ పురుషులారా ఏకం కండి!! పోరాడితే పోయేదేమీ లేదు. అశాంతి, అలజడి, ఎసిడిటి తప్ప!!!' అని మనసులో అనుకుని

''నువ్వే కాదు. నీ మగజాతంటేనే నాకొళ్లుమంట. నేను కనిపెట్టిన 'పురుష దుంప నాశిని' అనే మందును త్వరలోనే మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాను. దీంతో మగపురుగులను మొత్తంగా దుంప నాశనం చేసి, స్త్రీ జాతి సమస్తానికి విముక్తి ప్రసాదిస్తాను'

వెంగళరావు కుడిచేతిని పేంటు జేబులో పెట్టుకుని, రహస్యంగా పిడికిలి బిగించేడు.

ఇంతలోనే పెద్దపులి గాండ్రించినట్లుగా అరుపులు వినిపించడంతో వెంగళరావుకి వణుకు ప్రారంభమైంది. నది ఒడ్డుకు చేరి, నోరు తెరిచిన మొసలిలా, ఝాన్సీ భారీ ఎత్తున నోరు తెరిచి గురక ప్రారంభించింది. ' ఆహా...మహాతల్లికి ఈ సుగుణం కూడా వుందన్నమాట!' అని మనసులో అనుకున్నాడు.

పక్కలో రెండు బల్లేలు పెట్టుకుని మంచంపై పడుకునే కంటే, కటిక నేలపై పడుకోవడమే బహుభద్రమని భావించి, వెంగళరావు చాపను ఆశ్రయించేడు.

తను భయపడినంతా జరిగింది. భయపెట్టే భార్యతో భవిష్యత్తును ఊహించుకుంటుండగా, అతనికి నిద్ర పట్టేసింది.

మధ్య రాత్రిలో వెంగళరావుకు మెలకువ వచ్చేసింది. బతికుంటే బిర్యానీ ఆకైనా తిని బతకొచ్చునుకుని నెమ్మదిగా లేచి, గడియ తీసుకొని బయటపడ్డాడు. అలా గోడ దూకి పారిపోయినవాడు దట్టమైన అడవిలో తేలేడు.

***

కొద్ది సంవత్సరాల కాలంలోనే పురుషలైట్ నాయకుడిగా ఎదిగేడు. ప్రస్తుతం అతను డెన్‌లో కూర్చుని టీవీలోని వార్తలను చూస్తున్నాడు. అతని అనుచరులు భుజాన తుపాకులు ధరించి అన్ని వైపులనున్న కొండచరియలపై నిలబడి పహరా కాస్తున్నారు.

ఇంతలో కొంతమంది అనుచరులు టీవీ-7 నుంచి వచ్చిన యాంకర్రావునూ, కెమెరామేన్‌నూ నాయకుడి ముందు నిలబెట్టేరు.

కెమెరామేన్ బ్యాగులోంచి కెమెరా బయటకు తీసి షూటింగ్ ప్రారంభించేడు. యాంకర్రావు ఇంటర్వ్యూకి సిద్ధమయ్యాడు.

''మిమ్మల్ని మీరు పురుషలైట్లగా ఎందుకు పిలుచుకుంటున్నారు?''

''పురుషులకు వెలుగు చూపిస్తున్నాం కాబట్టి!''

''మీరేం సాధించదలిచేరు?''

'భార్యల్లేని సమాజాన్ని''

''అదెలా సాధ్యమవుతుందనుకుంటున్నారు?''

''సిగార్ గొట్టం ద్వారానే పురుషాధికారం సాధ్యమవుతుంది. మగాడై పుట్టిన ప్రతి ఒక్కడూ సిగార్‌ను వెలిగించి, ఆ పొగను భార్యలపై ఊదుతూ వుంటే వాళ్లు చచ్చి ఊరుకోవడం తథ్యం! ఎందుకంటే సిగరెట్ కాల్చిన వాళ్లకన్నా, పీల్చిన వాళ్లకు ఎక్కువ ప్రమాదం కాబట్టి!''

''ఇలా అడవులను పట్టుకు తిరిగే బదులు, జనప్రవంతిలో కలిసి కూడా, మీ ఆశయాలను సాధించవచ్చు కదా?''

''కొంపల్లో భార్యలుపెట్టే బాధలు కంటే, దుంపలు తింటూ, అడవిలో క్రూరమృగాల మధ్య తిరగడమే మాకు ప్రశాంతంగా అనిపిస్తోంది. ఇందు




లోని సుఖాన్ని గ్రహించబట్టే, రోజురోజుకీ అనేక మంది కొత్త భర్తలొచ్చి మాలో కలిసిపోతున్నారు''

''మీరంతా ఇలా కొంపా గోడూ వదిలేసి వనవాసం చేస్తుంటే, కుటుంబ వ్యవస్థ ఏం కావాలి?''

''ఆ మధ్యనే మీ టీవీ-7లో చూసాను. ప్రభుత్వం 'భ.పా.భా.పి'(భర్తలు పారిపోయిన భార్యలకు పింఛను) పథకం కింద భార్యలకు ఆర్థిక సహాయం అందిస్తోందట కదా! అందుకే మేం ప్రభుత్వంపై కూడా దాడులు నిర్వహిస్తున్నాం''

''ఊళ్లో భార్యలూ, అడవుల్లో భర్తలూ - ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే, భవిష్యత్తులో పిల్లలెలా పుడతారు? కొద్ది కాలానికి మానవ సమాజం అంతరించిపోదా?''

''మా సంస్థలో కొంతమంది శాస్త్రవేత్తలు కూడా వున్నారు. మగాళ్లు గర్భం ధరించి మగపిల్లలకు మాత్రమే జన్మనిచ్చే అవకాశాలపైన వాళ్లు పరిశోధనలు చేస్తున్నారు.''

'' ఆడవాళ్ల మీద మీకెందుకింత వ్యతిరేకత?''

''ఎందుకంటే? ఆడాళ్లంతా హిస్టీరియా పేషెంట్లు. వాళ్లకి ఎప్పుడు కోపం వస్తుందో, ఎప్పుడు అరుస్తారో వాళ్లకే తెలియదు.. మగాళ్లంతా రేపిస్టులని, ఇరవై నాలుగ్గంటలూ వాళ్లదే ఆలోచిస్తారని- ఇరవై నాలుగున్నర గంటలూ స్త్రీలు అదే ఆలోచిస్తుంటారు. ప్రపంచంలోని ప్రతి భార్యా- 'నా మీద నీకు ప్రేమ తగ్గిపోయింది' అంటూ పెళ్లయిన మొదటి రోజునుంచే భర్తపై ఆరోపణలు చేస్తూ వుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే-బాధించేది భార్య భరించేవాడు భర్త''

యాంకర్రావు వెంగళరావును టీవీ వైపు చూడమనిచెపుతూ ''భార్యలపై కరుడుకట్టిన మీ అభిప్రాయాల్లో మార్పు తీసుకురావడానికి మేం ఓ ప్రయత్నం చేస్తున్నాం. మా టీమ్‌లోని కొంతమంది ఇదే సమయానికి మీ పురుషలైట్ల భార్యల వద్దకు వెళ్లి లైవ్ ఇంటర్వ్యూ చేస్తున్నారు చూడండి. మీరు ఇళ్లకు తిరిగి రావాలని వాళ్లెంత తపన పడుతున్నారో మీకు అర్థమవుతుంది'' అన్నాడు.

టీవీ-7లో అడ్వర్‌టైజ్‌మెంట్ అయిపోగానే, అసలు కార్యక్రమం మొదలైంది. ఓ పెద్ద హాలులో స్త్రీలంతా పట్టుచీరలు కట్టుకుని, లిప్‌స్టిక్‌లు పూసుకొని, బంగారు నగలు మెడనిండా దిగేసుకొని, పేరంటానికి వచ్చినంత సంబరంగా వున్నారు.

అక్కడున్న యాంకర్లలో ఒకతను మైక్‌ని ఓ స్త్రీ ముందుంచి, ప్రశ్నించడం మొదలుపెట్టేరు.

''మీ భర్త పురుషలైట్‌లో చేరిపోవడం పట్ల మీరేం అనుకుంటున్నారు?''

ఆమె పట్టుచీరకున్న పైట అంచు మొత్తం టీవీలో కనిపించేలా ముందుకు లాగి మాట్లాడడం ప్రారంభించింది. ''నిజం సెప్పాలంటేనండి, పేణం ఆయిగా వుందండి. మా మొగతను ఇంటో వున్నప్పుడండీ-కుక్కపిల్లలా సీటికి మాటికీ కాల్లకి అడ్డుపడిపోయావోడండి. అడ్డగాడిదలా ఈదులన్నీ తెగ తిరిగేవోడండి. ఇంటికొచ్చిన కాన్నించీ- టీ ఎడతావా, టిపినెడతావా, నా పిండాకూడెడతావా...అని ఎప్పుడూ తిండేవతోనే సచ్చేవోడండి, గుర్రం గుడ్డిదైనా దానా తప్పనట్లు దమ్మిడీ ఆదాయం లేకపోయినా, ఈ మడిసికి వొణ్ణం వొండి పెట్టాల్సి వచ్చీదండీ...''

మధ్యలో యాంకర్ అడ్డుపడి, ''అమ్మా....మీ సొంత విషయాలు వదిలిపెట్టండి. సిగార్ గొట్టం ద్వారానే పురుషాధికారం వస్తుందని పురుషలైట్లు అంటున్నారు కదా! దానిపై మీ అభిప్రాయం?'' అన్నాడు.

''ఎవుడో గొట్టంగాడు ఏదో అంటే, నానేటంతాను!''

టీవీలోని యాంకర్ ''కట్...కట్''అని అరవడంతో లైవ్ ప్రోగ్రామ్ ఆగిపోయింది. స్క్రీన్‌పైన దోమలు ముసురుకున్నట్లుగా చుక్కలు కనిపించేయి.

వెంగళరావు అందరికంటే ముందుగా తేరుకుని ''యాంకర్రావ్, అర్థమైందా? ఇదీ ఆడవాళ్ల అసలు స్వరూపం! ప్రభుత్వం ఇలా నెలనెలా 'భ.పా.భా.పి' పథకం కింద భార్యలకు డబ్బు అందజేస్తూ వుంటే, ఇదే జరుగుతుంది. మిగిలిన భార్యలు కూడా పెరుగన్నంలో ఎలకల మందు కలిపి, తమ భర్తలతో తినిపించి శవాలను కూడా గల్లంతు చేసేసి, అడవిలోకి పారిపోయేరని నమ్మబలుకగలరు.'' అన్నాడు.

యాంకర్రావు లేచి నిలబడుతూ ''చివరిగా ఒక ప్రశ్న - మీ కార్యక్రమాలు ఇంత భారీ ఎత్తున నిర్వహించడానికి అవసరమైన నిధులను రహస్య సంస్థ అందిస్తోందన్న విమర్శ వుంది. మీ సమాధానం?'' అన్నాడు.

''సంఘ మర్యాద కోసం, సంసారమనే రొచ్చులో ఇంకా పొర్లుతున్న కొంత మంది భార్యాబాధితులు మాకు నిధులు సమకూర్చడం ద్వారా తమ సానుభూతిని వ్యక్తం చేస్తున్నారు. అంతే తప్ప, మా వెనుక ఏ రహస్య సంస్థా లేదు'' అని వెంగళరావు నొక్కి ఒక్కాణించేడు.

టీవీ-7లో మళ్లీ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తెరపైకి ఓ యాంకర్ కనిపించేడు. 'అనివార్య కారణాల వలన, పురుషలైట్ల భార్యలతో లైవ్ ఇంటర్వ్యూను ప్రసారం చేయలేకపోతున్నందుకు విచారిస్తున్నాం. అయినప్పటికీ పురుషలైట్లకు సంబంధించిన తాజా వార్తలు మీరిప్పుడు వింటారు... పురుషలైట్ల భార్యలు తమకు ప్రభుత్వం నెలనెలా అందిస్తున్న పెన్షన్ నుంచి కొంత సొమ్మును సేకరించి 'భార్యాబాధితులు' అనే దొంగ పేరుతో పురుషలైట్లను చేరదీసి, వారు ఎల్లప్పుడూ అడవుల్లోనే ఉండిపోయేటట్లు ప్రణాళిక సిద్ధం చేసేరు...

వెంగళరావు మొహంలో రంగులు మారేయి. వెంటనే యాంకర్రావు వెంగళరావు కాళ్లపై పడి ''సార్... పురుషలైట్లే నిజమైన దేశభక్తులని నమ్ముతున్నాను. నన్ను కూడా మీలో చేర్చుకోండి సార్!'' అంటూ ప్రాధేయపడ్డాడు.

టీవీ వార్తలు కొనసాగుతున్నాయి. ''పురుషలైట్ల కార్యక్రమాలకు ముగ్ధులైన ప్రపంచబ్యాంకు అధికారులు వారికి రెండువేల కోట్ల రూపాయల రుణం మంజూరు చేసారు...''

వెంటనే వెంగళరావు ఎగిరి గంతేసాడు. ''దీంతో మా ఆశయాలన్నీ త్వరలోనే నెరవేరతాయి!'' అన్నాడు.

''సార్... ప్రపంచ బ్యాంకు సహాయం అందించిందంటే, దాని వెనుక దారుణమైన షరతులుంటాయి. చూసుకోండి!'' అన్నాడు యాంకర్రావు.

వెంటనే వెంగళరావు ''ఏం భయం లేదు లేవయ్యా! ప్రపంచ బ్యాంకు ఒకే ఒక షరతు విధించింది. భార్యాభర్తలు భవిష్యత్తులో ఒక రోజు కలిసి సంసారం చేసినా, ఒకరికొకరు యూజర్ ఛార్జీలు కట్టాలి. దానిపైన సర్వీస్ టాక్స్ మామూలే. ఇలా వసూలైన సొమ్ముతో ప్రపంచబ్యాంకు రుణం తీర్చాలి. దీంతో భార్యాభర్తలు ఒకరికొకరు కష్టమర్లు అవుతారు. ఈ విధంగా భార్యల్లేని సమాజం ఏర్పడుతుంది. మా కల నెరవేరే సమయం ఆసన్నమైంది ఆహా..హా..'' అంటూ గట్టిగా నవ్వడం ప్రారంభించేడు.

''ఏమోయ్... వెంగళ్..... కల వచ్చిందా! మరొక్కసారి నోరు తెరిచావో, నీ నాలుక తెగ్గోస్తా'' అంటూ ఝాన్సీ కత్తి పట్టుకొని అపరకాళిలా ఎదుట ప్రత్యక్షమైంది.

ఆ కేకలకు వెంగళరావు ఉలిక్కిపడి కళ్లు తెరిచేడు. ఎదురుగా అడవీ లేదూ, అనుచరులూ లేరు! తుస్సుమన్న చిచ్చుబుడ్డిలా అతని మొహం కళావిహీనంగా మారిపోయింది.

★